దేవుడు ఎలా వుంటాడో ఇతరులు చెప్పింది ఖండించి, తను చూసిన దేవుడ్ని చెప్పేవాడు, అడవిలోకి వెళ్ళి ఊసరివెల్లిని చూసివచ్చిన ఆ ముగ్గురు మనుషుల్లాంటివారే.

## 97. సహాయం

ఓ బాటసారి ఓ గ్రామంలోంచి వెళ్తూ, చలిలో వణుకుతూ ఆకలిగా వున్న ఓ అనాథ బాలుడ్ని చూసాడు. ఆ బాటసారికి దేవుడి మీద వెంటనే కోపం వచ్చింది. తలెత్తి పైకి చూస్తూ కోపంగా అరిచాడు.

"ఓ దేవుడా! ఎందుకు నువ్వు ఇలాంటివి అనుమతిస్తున్నావు? ఈ బాలుడి కోసం నువ్వేమైనా చేయరాదా?"

వెంటనే పైనించి దేవుడి కంఠం వినిపించింది.

"ఆ బాలుడి కోసం నేనేం చేయలేదని నువ్వు ఎందుకు అనుకుంటున్నావు? వాడికి సహాయం చేస్తావనే నిన్నా దారిలో వెళ్ళేలా చేసాను."

## 98. ఉన్నది-పోయింది

ధార్మికుడైన ఓ ధనవంతుడు తన ఊళ్ళోని గడ్డు రోగాలు వచ్చిన వాళ్ళు చికిత్స కోసం దూరప్రాంతానికి వెళ్ళడం గమనించాడు. అలాంటివాళ్ళకి తమ ఊళ్ళోనే వైద్య సౌకర్యం కల్పించాలన్న సదుద్దేశంతో తన ఖర్చుతో ఓ పెద్ద హాస్పిటల్‌ని నిర్మించాడు. నిర్వహణ కోసం దాన్ని ప్రభుత్వానికి అప్పగించాడు.

కొద్ది కాలం తర్వాత అతని వ్యాపార పరిస్థితులు తారుమారై, వ్యాపారంలో విపరీతంగా నష్టం వచ్చింది. ఉన్న డబ్బంతే పోయి పూర్తిగా దివాలా తీసాడు. అతని బంధు మిత్రులు కొందరు అతన్ని కోపంగా మందలించారు.

"నీ దగ్గర డబ్బున్నప్పుడు దాన్ని వైద్యశాల నిర్మాణానికి తగలేసావు. ఆ పని చేయకుండా వుండివుంటే ఇప్పుడు నీ పరిస్థితి బావుండేది."

అందుకతను చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు.

"మీరు చెప్పిన విషయం మీరు చూసే కోణంలోంచి నేను చూడటంలేదు. నేను నా జీవితకాలంలో సంపాదించిన డబ్బంతా పోయినా, పోకుండా నాకు మిగిలింది ఈ హాస్పిటల్‌కి పెట్టిన ఖర్చే. నేను ఇచ్చింది నాకు పొదుపైంది. నేను ఇవ్వనిది వృధా అయింది.'

# 99. గురుసేవ

ఓ సాధకుడు ఓ గురువుని ఇరవై ఏళ్ళపాటు సేవిస్తూ గడిపాడు. అయినా గురువు తనంటే ఎంతో నిర్లక్ష్యంగా వుండటం గుర్తించిన అతను ఓ సాధు పురుషుడి దగ్గరకి వెళ్ళి విచారంగా చెప్పాడు.

"నా గురువుకి నేనెంతోకాలంగా సేవ చేస్తున్నాను. ఐనా ఆయన నామీద శ్రద్ధని చూపించడం లేదు. కారణం మీరు చెప్పగలరా?"

ఆయన కొద్ది క్షణాలు ఆలోచించి అడిగాడు.

"మూడు ప్రశ్నలకి జవాబు చెప్పు. నీ గురువుని నువ్వు ఇసకలో పడ్డ నీ ఉంగరాన్ని వెదికేంత ఉత్సాహంతో, శ్రద్ధగా సేవిస్తున్నావా? ఓ చిన్న ఉద్యోగి మహారాజుని సేవించేంత భయంతో, శ్రద్ధగా సేవిస్తున్నావా? ఓ లోభి తన ధనాన్ని సంరక్షించుకునేంత ప్రేమతో, శ్రద్ధగా నువ్వు నీ గురువుని సేవిస్తున్నావా?"

"లేదు."

"మరి నువ్వు ఆయన్ని అత్యంత ఉన్నతమైన దాన్ని కోరుతున్నప్పుడు అత్యంత ఉన్నతమైన సేవ చేయకపోతే, ఆయన నువ్వంటే నిర్లక్ష్యంగా వుండటంలో తప్పు లేదు కదా?"